7

సాక్షి సంగారెడ్డి

గురువారం । 27 । జూన్ । 2024

ఇష్టంలేని వారు వెళ్లిపోండి

- వైద్యులపై ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆగ్రహం
- సూపరింటెండెంట్, ఆర్ఎంఓ గైర్హాజరు
- పలువురు సిబ్బంది సైతం విధులకు డుమ్మా



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విధి నిర్వహణ పట్ల అలసత్వం వహించే వైద్యులు, సిబ్బంది పట్ల ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి హెచ్చరించారు. స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు వైద్యులు, సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడం, అనుమతి లేకుండా సెలవులు వేసుకొని వెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టంలేని వారు వెళ్లిపోవాలని, బాధ్యతగా పనిచేసే వారే ఉండి సేవలు అందించాలని సూచించారు. వైద్యుడిని అయిన తన నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. పేద రోగులకు సేవలందిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాల్సిన సిబ్బంది ఇలా డుమ్మాలు కొట్టడం ఏమిటని మండిపడ్డారు. సూపరింటెండెంట్, ఆర్ఎంఓ గైర్హాజరు కావడం, అనుమతి లేకుండా సెలవులు తీసుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డెంటిస్ట్ అయిన ఆర్ఎంఓ 19న అనుమతి తీసుకున్నట్టు ఉండగా 26 వరకు అడ్వాన్స్‌గా సీఎల్ వేశారు. ఫార్మాసిస్ట్ భీంరావు సదాశివపేటకు డిప్యూటేషన్ వేసుకొని వెళ్లారు. అతను ఒక్కసారి కూడా నారాయణఖేడ్‌లో విధులకు రాకపోవడం, గతంలో ఉన్న నేతల సిఫారసులతో డిప్యూటేషన్ వేసుకొని వెళ్లిన విషయం వెల్లడి కావడంతో వెంటనే సరెండర్ చేయాలని ఆదేశించారు. మరో ఫార్మాసిస్ట్ శ్యాంరావు కూడా జోగిపేటకు డిప్యూటేషన్ వేసుకొన్నాడు. మరికొన్ని విభాగాల్లోని సిబ్బంది కూడా విధులకు డుమ్మా కొట్టడం బయట పడింది. ఈ విషయాలపై జిల్లా వైద్య విధాన పరిషత్ వైద్యులు సంగారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వీరిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. శానిటేషన్ సిబ్బందికి డ్రెస్సింగ్, ఇతర విధులు ఎలా చెబుతారన్నారు.

వైద్యసేవలపై కలెక్టర్ అసంతృప్తి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్: ఏరియా ప్రభుత్వాస్పత్రి నిర్వహణ తీరుపై కలెక్టర్ క్రాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి రికార్డులను, వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. రోజుకు ఎన్ని స్కానింగ్‌లను తీస్తున్నారని వైద్యురాలిని అడిగారు. శనివారం నాడు మాత్రం ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తున్నారన్నారు. స్కానింగ్ ఎక్కడ తీసుకున్నావని బాలింతను అడుగగా బయట తీయించుకున్నట్లు చెప్పింది. బయటే ఎందుకు తీసుకున్నావనే విషయమై కలెక్టర్ ఆరా తీశారు. రక్త పరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు. బ్లడ్ బ్యాంకు అవసరం ఉందని వైద్యులు తెలిపారు. శానిటేషన్ తీరు అధ్వానంగా ఉందన్నారు. వైద్యులు, సిబ్బందికి సంబంధించిన బయో మెట్రిక్ వివరాలను ఇవ్వమని వైద్యులను అడగగా.. సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతోందన్నారు. వైద్యులు డ్రెస్‌కోడ్ పాటించక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు.



కూరల సాగు.. లాభాలు మెరుగు

సంప్రదాయ పంటలు వద్దు.. స్వల్పకాలమే ముద్దు

- కూరగాయల సాగుపై రైతన్నల ఆసక్తి
- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం
- పెద్దగా అవసరం లేని కూలీలు
- మార్కెట్‌లోనూ దేనికదే డిమాండ్

ఒకనాడు సంప్రదాయ పంటలే దిక్కు.. వరి రైతు వరి.. పత్తి రైతు పత్తి.. ఇవే కనిపించేవి.. మార్పు అనేదే ఉండేది కాదు.. కానీ నేడు రైతు మారిపోయాడు. కాలంతోపాటు పరుగులు పెడుతున్నాడు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటల వైపు చూస్తున్నాడు. ఏడాదికి సుమారు మూడు నుంచి నాలుగు పంటలు వచ్చే కూరగాయల సాగుపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఎందుకంటే ఎకరా సాగు చేస్తే ఖర్చులు పోను సుమారు రూ.లక్ష వరకూ ఆదాయం వస్తుందని అంచనా వేసుకుంటున్నాడు. పెద్దగా కూలీల అవసరం లేకుండా కుటుంబ సభ్యులతో కలిసి పని చేసుకునే వెలుసుబాటు ఉండడంతో కూరగాయాలే వేస్తున్నారు.

వివరాలు 8లో ▶

న్యూస్‌రీల్

భూ సర్వే పనులు ప్రారంభం

జోగిపేట (అందోల్): జోగిపేట–అజ్జమర్రి రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన భూ సర్వే పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. జోగిపేటకు, గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకలు సాగించేందుకు, వ్యాపారపరంగా అభివృద్ధికి గాను మంత్రి రాజనర్సింహ ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ మేరకు ప్రభుత్వం కూడా రూ.80 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయితే రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి కొలతలను ప్రారంభించి రెడ్ మార్క్ వేశారు తహసీల్దార్ భాస్కర్, సర్వేయర్ సాయి, ఆర్అండ్‌బీ ఏఈఈలు. జోగిపేటలోని మల్లన్న కాలనీ నుంచి మంజీరా వాగు వరకు సుమారుగా 3.2 కిలో మీటర్లు ఉందని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించి రెడ్‌మార్క్ వేస్తున్నామన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థిక సహాయం అందిస్తున్న ఎస్పీ, తోటి ఉద్యోగులు

సంగారెడ్డి : ఏఆర్ కానిస్టేబుల్ యాదగిరి అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబానికి తోటి సిబ్బంది ఆర్థిక సాయం అందించారు. బుధవారం ఎస్పీ చెన్నూరి రూపేశ్ చేతుల మీదుగా రూ. 2,16,324లను యాదగిరి భార్య శ్రీవిద్య, కొడుకు హర్షిత్ (4)లకు అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథం కలిగి ఉండాలన్నారు. అనంతరం యాదగిరి మృతి పట్ల ఉద్యోగులు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

విద్యాసంస్థల బంద్



బయటకు వస్తున్న విద్యార్థులు

నారాయణఖేడ్: ఏబీవీపీ బంద్ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని విద్యాసంస్థలు మూతపడ్డాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పిలుపు ఇచ్చింది. దీంతో సంఘం బాధ్యులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి బంద్ చేయించడంతో విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాయి. సంఘం నాయకులు పవన్‌రెడ్డి, శంకర్ తదితరులు బంద్‌ను పర్యవేక్షించారు. తమకు సహకరించిన విద్యాసంస్థలు, ఉపాధ్యాయులకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని గ్రామాల్లో వన మహోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): అన్ని గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శ్రావణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పెద్దశంకరంపేట శివారులోని స్థలాన్ని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుంతలు తీసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. వర్షాలు కురియగానే మొక్కలు నాటుతామని వివరించారు.

మార్కెట్ రేటు ప్రకారం పరిహారం

- మంత్రి దామోదర రాజనర్సింహ
- నిమ్జ్ భూ బాధితులకు రూ. 22.72 కోట్ల చెక్కుల పంపిణీ
- అండగా ఉంటామని భరోసా



నిమ్జ్ భూ బాధితురాలికి చెక్కు అందిస్తున్న మంత్రి దామోదర, కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న నిమ్జ్ లో భూములు కోల్పోతున్న భూ బాధితులకు అండగా ఉంటామని మంత్రి దామోదర రాజనర్సింహ భరోసా ఇచ్చారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఫంక్షన్ హాల్‌లో నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 229 రైతు కుటుంబాలకు 500 ఎకరాలకు గాను రూ. 22. 72 కోట్ల విలువ గల చెక్కులను కలెక్టర్ క్రాంతి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 2017–18లో కాళేశ్వరం, మల్లన్న సాగర్ ప్రాజెక్టులతో నష్టపరిహారం పెంపు కోసం పోరాటం ప్రారంభమైందన్నారు. నాటి ప్రభుత్వం ఇచ్చిన 123 జీఓ చెల్లదని, ముందుండి పోరాటం చేశామని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో కూడా 123 జీఓ చెల్లదని, పట్టా భూమికి, అసైన్డ్ భూమికి, వ్యవసాయ సాగులో ఉన్న భూమికి ఎలాంటి వ్యత్యాసం లేకుండా మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని పోరాడిన ఆరేళ్లకు రైతులకు, భూ నిర్వాసితులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. తీర్పుకనుగుణంగా భూ నిర్వాసితులకు పరిహారం ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 5 ఎకరాల భూ సేకరణ పూర్తయిందన్నారు. మిగతా 7 ఎకరాల సేకరణ కొనసాగుతుందన్నారు. చట్టం ప్రకారం నష్టపరిహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడి ప్రాంత రూపురేఖలు మారి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని వెల్లడించారు. పరిశ్రమల స్థాపనతో సుమారు 2 లక్షల 50 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. రైతు రుణమాఫీ రూ. 31 వేల కోట్లతో చేస్తామన్నాన్నారు. ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ముందుగా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు వినీల, ఎంపీపీ దేవదాసు, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, సీనియర్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, తన్వీర్ పాల్గొన్నారు.

క్లినిక్ ప్రారంభం

సంగారెడ్డి : శ్రీబాలాజీ హాస్పిటల్స్ సూపర్ స్పెషాలిటీ ఓపీడీ క్లినిక్‌ను బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొట్టమొదటి అడ్వాన్స్‌డ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రజలకు ఉచిత కార్డియాలజీ సేవలు అందజేయనున్న హాస్పిటల్ ఇదేనని ఆయన, హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మల, డీఎంహెచ్ఓ గాయత్రిదేవి, బాలాజీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీశైలజా, సందీప్ కుమార్‌రెడ్డి (ఆర్థోపెడిక్), డా.శ్రవణ్ (ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్), డా.పవన్ కుమార్ (సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్), డా.వేణుగోపాల్ (కార్డియాలజిస్ట్), డా. శ్రావణి (జనరల్ ఫిజిషియన్), డా.అక్బర్ (ఎమర్జెన్సీ మెడికల్) తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

- సీఎస్‌కు డీసీఎంఎస్ చైర్మన్ ఫిర్యాదు



డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్

జహీరాబాద్: ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించే విషయంలో జహీరాబాద్ ఆర్డీఓ రాజు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ ఆరోపించారు. ఆ మేరకు చీఫ్ సెక్రటరీ(సీఎస్) శాంతికుమారికి ఫిర్యాదు చేశారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో నిర్వహించిన నిమ్జ్ భూముల పరిహారం పంపిణీకి మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించక పోవడం సరైంది కాదన్నారు. ఝరాసంగం మండలం ఇప్పపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నానని, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నట్లు వివరించారు. తన సొంత మండలమైన ఝరాసంగంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రొటోకాల్ పాటించక పోవడాన్ని తప్పుపడుతూ ఫిర్యాదు చేశారు. ఇందుకు బాధ్యులైన ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.





జిన్నారం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు సంగారెడ్డి టౌన్: మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

డ్రగ్స్ నిర్మూలిద్దాం : ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి /జిన్నారం (పటాన్‌చెరు): మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత సహకరించాలని ఎస్పీ రూపేశ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోఅంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి మెడికల్ కాలేజీలో, చౌటకూర్ మండలం సుల్తాన్పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. అలాగే సంగారెడ్డిలో ఐబీ నుంచి ర్యాలీ కలెక్టరేట్ వరకు, ర్యాలీ నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ విద్యార్థులు, జిన్నారంలో సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ విజయారావుల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడకూడదన్నారు. వాటి నిర్మూలనకు విద్యార్థులు, తల్లిదండ్రులు, యువకులు భాగ్యస్వాములు కావాలన్నారు. బయట ప్రదేశాల్లో గంజాయి, డ్రగ్స్‌లను వినియోగిస్తే 87126–56777 నంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జే హరికిషన్ మాట్లాడుతూ, డ్రగ్స్‌కు దగ్గరయ్యే ప్రతి ఒక్కరూ కష్టాలు చవి చూడవలసి వస్తుందన్నారు. వినియోగం వల్ల సామాజిక, ఆర్థిక న్యాయమైన ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి రమేశ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ కమిషనర్ నవీన్ చంద్ర, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , జిల్లా ఎక్సైజ్ శాఖ సుపరింటెండెంట్ నవీన్ పాల్గొన్నారు.

పరిపాలనా సౌలభ్యం

- ఖేడ్ రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా
- నియామకం కానున్న అదనపు పరిపాలనాధికారి



రెవెన్యూడివిజన్ కార్యాలయం

నారాయణఖేడ్: పరిపాలనా సౌలభ్యం కోసం ఆయా జిల్లాల్లోని 15 రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్‌కు అవకాశం దక్కింది. సబ్ కలెక్టర్ హోదాతో ఐఏఎస్ అధికారి నియామకం కానున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి మరింత వేగిరం అయ్యేందుకు ఆస్కారం ఏర్పడింది. రాష్ట్రంలోని కొన్ని రెవెన్యూ డివిజన్లకే ఈ అవకాశం కల్పిస్తూ జీఓ 834 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న రెవెన్యూ డివిజన్లకే ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్ హోదాలో కేటాయిస్తుంది.

పాలన కోసం..

సాధారణంగా ఐఏఎస్ అధికారి ఉంటే కిందిస్థాయి సిబ్బంది విధి నిర్వహణలో పారదర్శకత కనిపిస్తుంది. తద్వారా ప్రజా సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయి. ఐఏఎస్ శిక్షణ పూర్తయిన అధికారులు నేరుగా సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యే ఆస్కారం ఉంటుంది. వారి వృత్తి నైపుణ్యం వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే జిల్లాకు కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పోస్టింగ్‌లను ప్రభుత్వం కేటాయించింది. ఈ ముగ్గురికి తోడు ఖేడ్‌లోని మరో ఐఏఎస్ అధికారి జత కానున్నారు.

ఐఏఎస్ అధికారిని రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌గా నియమించడం వల్ల క్షేత్రస్థాయిలో పేరుకు పోయిన సమస్యలకు సత్వర పరిష్కారం దొరికే అవకాశం ఉంటుంది. గ్రామీణ స్థాయి, మారుమూల గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుంది. దీంతో వాటిని వెంటనే పరిష్కరించేందుకు ఆస్కారం ఉంటుంది. పాలనాపరంగా ఉన్న ఇబ్బందులూ తొలగిపోతాయి. ప్రజల సమస్యలను ప్రజావాణి ద్వారా నేరుగా సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. కలెక్టర్, మండల, రెవెన్యూ విభాగాల మధ్య అనుసంధానం

అనుసంధాన కర్తగా..

గా రెవెన్యూ డివిజన్ పరిపాలనా వ్యవహారాలను సబ్ కలెక్టర్ పర్యవేక్షిస్తారు. ఖేడ్ నియోజకవర్గం కర్ణాటక, మహారాష్ట్రలకు సరిహద్దుగా మారుమూలగా ఉంది. ఉమ్మడి జిల్లాలోనే ఈ నియోజకవర్గం అత్యంత వెనుకబాటుకు గురైంది. పట్టణాలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల వరకు సమస్యలు నెలకొని ఉంటాయి. ఓ ఐఏఎస్ అధికారి ఇలాంటి మారుమూల ప్రాంతాల్లో ఉండడంతో ఆయన నేరుగా గ్రామీణ, గిరిజన తండాలను సందర్శించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడంతోపాటు, ప్రజలు సైతం నేరుగా ఆయన వద్దకు వెళ్లి పరిష్కారం కోసం కోరేందుకు ఆస్కారం ఉంటుంది. మొత్తంగా చూస్తే ఐఏఎస్ నియామకం ఖేడ్ నియోజకవర్గ పురోభివృద్ధికి దోహదమయ్యే అవకాశం ఉంది.

‘రంగనాయకా..’ నీళ్లేవి?

వట్టిపోతున్న రిజర్వాయర్ ఆందోళనలో రైతన్న

నాడు నిండుకుండాలా ఉన్న రంగనాయకసాగర్ రిజర్వాయర్ నేడు వట్టిపోతోంది. నీటి మట్టం తగ్గడంతో రిజర్వాయర్‌లో మునిగిపోయిన సిద్దిపేట-చంద్లాపూర్ గ్రామ రహదారి, చెట్లు, వ్యవసాయ బావుల వద్ద ఉన్న సంపులన్నీ తేలుతున్నాయి. 3 టీఎంసీల సామర్థ్యం గల రంగనాయకసాగర్‌కు ఎగువ నుంచి పంపింగ్ చేయకపోవడంతో 0.70 టీఎంసీలకు పడిపోయింది. ఈ రిజర్వాయర్ సాగు ఆయకట్టు 1.10 లక్షల ఎకరాలు ఉండగా ప్రస్తుతం 65,843 ఎకరాలకు సాగు నీరందుతోందని అధికారులు పేర్కొంటున్నారు. అక్కడ నిర్మిస్తున్న అభివృద్ధి పనులు సైతం ఆగిపోయాయి. నీరు తగ్గిపోవడంతో రైతాంగం ఆందోళనకు గురవుతోంది. - సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



నీరు తగ్గిపోవడంతో వెలవెలబోతున్న రంగనాయక సాగర్

క్లుప్తంగా

ఇష్టపడి చదవాలి: డీఈవో


మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గురువన్నపేట ఉన్నత పాఠశాలకు అక్షర జ్యోతి ఫౌండేషన్ ప్రతినిధులు రూ.50 వేల విలువైన డెస్కులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. జిల్లాలోని 1,514 పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా నిధులు మంజూరి చేసి ప్రతీ పాఠశాలలో మౌలిక వసతులు సమకూర్చుతున్నారని అన్నారు. అనంతరం అక్షర జ్యోతి ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమానికి ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, అక్షర జ్యోతి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

13 మంది బైండోవర్

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని జాలపల్లి, బైరాన్‌పల్లి గ్రామాల్లోని వాగుల్లో నుంచి అక్రమంగా ట్రాక్టర్‌ల ద్వారా ఇసుకను తరలిస్తున్న 13 మందిని బుధవారం తహసీల్దార్ శ్యాం ఎదుట పోలీస్‌లు బైండోవర్ చేశారు. ఇందులో జాలపల్లికి చెందిన బందారం సాగర్, మెతుకు జగన్‌మోహన్‌రెడ్డి, దాసరి రాకేష్, అల్లాడి రాజు, బైరాన్‌పల్లికి చెందిన బండి రాజు, నందనబోయిన రఘువర్ధన్, నాగిళ్ల గణేష్, నందనబోయిన నరేశ్, పెర్క సంపత్, బైరి స్వామి, పండుగ కనకరాజు, బత్తిని రాజ్‌కుమార్, పండుగ సాంబరాజు ఉన్నారు. వీరు మరోసారి నేరానికి పాల్పడితే రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. పోలీస్‌లు సీజ్ చేసిన 150 ట్రాక్టర్‌ల ఇసుకను నేడు వేలం వేయనున్నట్లు తెలిపారు.

నిషేధిత గుట్కా స్వాధీనం


గుట్కా ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ నిషేధిత గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణంలోని సుభాష్ రోడ్డులో ఇరుకుల చంద్రశేఖర్ నిర్వహిస్తున్న సీఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ షాపులో అక్రమంగా ప్రభుత్వ నిషేధిత గుట్కా నిల్వ ఉంచి అమ్ముతున్నట్లు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట టూటౌన్ పోలీసులు వెళ్లి బుధవారం షాపులో తనిఖీలు నిర్వహించారు. అక్కడ రూ. 2,05,000 విలువ గల గుట్కా, టొబాకో ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


అజ్మత్‌పాష(ఫైల్)

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని సత్వార్ గ్రామ వద్ద బుధవారం చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మత్ పాష(24) 65వ జాతీయ రహదారి మీదుగా మోటారు సైకిల్‌పై జహీరాబాద్‌కు తన మొబైల్ షాపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జహీరాబాద్ వైపు వస్తున్న మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో అజ్మత్ పాష తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కూరల సాగు.. లాభాలు మెరుగు

ప్రత్యామ్నాయ పంటలకే రైతుల మొగ్గు


మెదక్ మండలంలో బెండకాయ సాగు

400 ఎకరాల్లో కూరగాయలు


మార్కెట్‌కు తరలించేందుకు బీరకాయలు సిద్ధం చేస్తున్న రైతు

తూప్రాన్: తూప్రాన్ మండలంలోని మాల్కాపూర్, గుండ్రెడ్డిపల్లి, వెంకటాయిపల్లి, కోనాయిపల్లి, ఘనపూర్, దమ్మక్కపల్లి, అల్లాపూర్, ఇమాంపూర్, రామాయిపల్లి తదితర గ్రామాల్లోని రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తు న్నారు. మండలంలో సుమారు 400 ఎకరాల్లో కూరగాయల పంట సాగు చేస్తున్నారు. బీర, బెండ, క్యాబేజీ, చిక్కుడు, పచ్చిమిర్చి, వంకాయ, గోరుచిక్కుడు, కొత్తిమీర, మెంతి తదితర పంటలను సాగు చేస్తున్నారు. బోరు బావుల్లో నీరెక్కువగా ఉన్న రైతులు ఇంటికి సరిపోను వరి పంటను వేసుకొని మిగితా స్థలంలో కూరగాయలను పండిస్తున్నారు. పండించిన పంటలను హైదరాబాద్‌లో ని మార్కెట్‌కు తరలిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

ఐదారేళ్ల నుంచి సాగు..



ఎకరం పొలంలో మిర్చి, వంకాయ తదితర పంటలు సాగు చేశాను. ఐదారేళ్ల నుంచి కూరగాయాలు సాగు చేస్తున్నాను. కానీ ఎంతో కష్టపడి పంటలు సాగు చేస్తే మార్కెట్లో గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నాం. తాము తీసుకెళ్లిన కూరగాయలు తక్కువ ధరకు తీసుకొని ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. దీన్ని నివారించే అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

– జింక శేఖర్, రైతు, మల్కాపూర్

'చిక్కుడు'.. లాభాలు బోలెడు


మైలారంలో చిక్కుడు సాగు

వర్గల్(గజ్వేల్): జిల్లాలో వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతుండగా, వర్గల్ మండలంలో 1,000 పైగా ఎకరాల్లో చిక్కుడు, బీర, కాకర, కీర, మిర్చి, కూరగాయ పంటలు సాగుచేస్తారు. గౌరారం, సింగాయపల్లి, చౌదరిపల్లి, అవుసులోనిపల్లి, మైలారం, మక్త, జబ్బాపూర్, గిర్మాపూర్, గోవిందాపూర్, దండుపల్లి, బొర్రగూడెం, అనంతగిరిపల్లి, వేలూరు, సీతారాంపల్లి, మీనాజీపేట, అంబర్‌పేట, తున్కిఖాల్సా, తున్కిమక్త, గుంటిపల్లి, శేరిపల్లి, మల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో కూరగాయలు విస్తారంగా సాగుచేస్తారు. ప్రస్తుతం ఆరుతడి పంటగా మైలారం, చౌదరిపల్లి, గోవిందాపూర్, గౌరారంలో దాదాపు 250 ఎకరాల్లో చిక్కుడు సాగవుతుంది. తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జిస్తున్నారు.

చిక్కుడుతో చక్కని ఆదాయం



రెండెకరాల వ్యవసాయ భూమి ఉండగా డ్రిప్ ద్వారా పంటలు సాగు చేసుకుంటా. వరి సాగుకు ఎక్కువ నీళ్లు అవసరం. దిగుబడి కోసం ఆరు నెలలు ఎదురుచూడాలే. పొలం ఎండితే కుదురుకోదు. అందుకే ఆరుగాలం కష్టపడి నష్టాలెందుకని ఏడాది పొడుగునా చిక్కుడు, మిర్చి, స్వీట్‌కార్న్ మొక్కజొన్న, లోకల్ మొక్కజొన్న లాంటి ఆరుతడి పంటలు వేస్తున్న. ఒక పంట దెబ్బతీసినా మరో పంట ఆదుకుంటుంది.

–కనకయ్య, రైతు మైలారం

టమాట, పచ్చిమిర్చి, బీరకాయ


వర్ధరాజుపల్లిలో సాగు చేసిన టమాట పంట

దుబ్బాక: నియోజకవర్గంలోని తొగుట మండలంలోని వర్ధరాజుపల్లి, కాన్గల్, గోవర్ధనగిరి, దుబ్బాక మండలంలోని పద్మనాభునిపల్లి, మిరుదొడ్డి మండలంలోని లక్ష్మీనగర్, కాసులాబాద్, మోతె, అందె, అల్వాల గ్రామాల్లో చాలా మంది రైతులు కూరగాయలు పండిస్తున్నారు. 10 ఏళ్లుగా టమాట, పచ్చిమిర్చి, బీరకాయ, కాకర, సోరకాయ పంటలు పండిస్తూ మంచి లాభాలు పొందుతున్నారు వర్ధరాజుపల్లి రైతులు. గ్రామంలో 90 శాతంకు పైగా రైతులు కూరగాయల పంటలే పండిస్తుండడం విశేషం. ఎకరం టమాట పండిస్తే పంట బాగా వచ్చి ధర పలికి అన్ని ఖర్చులు పోయినా ఎకరానికి సుమారుగా రూ.4 లక్షల వరకు మిగులుతుంది. పచ్చి మిర్చి సైతం రూ.3 లక్షల వరకు అంత కంటే ఎక్కువగానే వస్తాయని రైతులు చెబుతున్నారు.

ఉద్యోగం వదిలి సాగులోకి..



నేను ఎంబీఏ చేసి హైద్రాబాద్‌లో జాబ్ చేశా. ఉద్యోగం మానేసి మా పొలంలోనే కూరగాయలు పండిస్తున్నా. ఎక్కువగా టమాట, పచ్చి మిర్చి, వంకాయ, కాకరకాయ పంటలు వేస్తా. ఇప్పుడు 2 ఎకరాల్లో టమాట వేశాను. మాకు నీళ్ల సరిగ్గా లేవు బోర్లు అంతంత మాత్రంగానే పోస్తుండడంతో వరికి స్వస్తి పలికి పూర్తిగా కూరగాయల పంటలే పండిస్తున్నాం.

– మహిపాల్‌రెడ్డి, రైతు వర్ధరాజుపల్లి

90 శాతం కూరగాయలే సాగు

మెదక్‌జోన్: జిల్లాలోని మెదక్ మండలం గుట్టకిందిపల్లి, మక్తభూపతిపూర్ గ్రామాల్లో కూరగాయల సాగుకు ఆ గ్రామాలు పెట్టింది పేరు. ఈ రెండు గ్రామాల్లో సుమారు 800 ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయి. 90 శాతం రైతులు కూరగాయల సాగు చేస్తుండగా 10శాతం మంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తారు. కొత్తి మీర నుంచి మొదలుకొని టమాట, బీర, కాకర, వంకాయ, బెండకాయ, చిక్కుడు, పచ్చిమిర్చి, దోసకాయ ఇలా అన్నిరకాల కూరగాయలను సాగుచేస్తారు. కూరగాయలను ఆటోలు, బైకులు, ఇతర వాహనాల్లో మెదక్, నర్సాపూర్, రామాయంపేట, హైదరాబాద్, నిజామాబాద్, మేడ్చేల్, తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తారు.

కొత్తి మీర, టమాట వేశాను



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. బోరులో వచ్చే కొద్దిపాటి నీటితో 10 గుంటలు కొత్తి మీర, 20 గుంటలు టమాట సాగు చేశాను. కిలో టమాట రూ.100 పలుకుతుంది. కిలో కొత్తి మీరకు రూ. 150 చొప్పున వస్తోంది. పంట తీరిపోయే వరకు రూ.3 లక్షల నుంచి 4 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

– పర్స నర్సింలు, గుట్టకిందిపల్లి

రూ.80 వేలు ఆదాయం



ఎకరంలో స్వీట్‌కార్న్ (మొక్క) సాగు చేశాను. గతేడాది చేను మీద అమ్మితే రూ.80 వేల ఆదాయం వచ్చింది. అమ్ముకుంటే రెండింతల ఆదాయం వస్తోంది. ఈసారి కాల్చి అమ్మాలనుకుంటున్నాను. కేవలం 3 నెలల్లో పంట చేతికందుతుంది. నీటి తడులు చాలా తక్కువ అవసరం ఉంటుంది.

– పర్స ప్రవీణ్ గుట్టకిందిపల్లి

భోజ పద్ధతిలో టమాట..


కొడిపల్లిలో టమాట పొలంలో రైతు వంజరి బాబయ్య

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కొడిపల్లికి చెందని వంజరి బాబయ్య తనకు ఉన్న రెండెకరాల పొలంలో వానాకాలంలో వరి పంటను సాగు చేస్తాడు. యాసంగి, వేసవి కాలం మాత్రం పంట మార్పు చేసి టమాట సాగు చేస్తున్నాడు. ఏడేళ్లుగా టమాట సాగు చేస్తున్నట్లు చెప్పారు. నవంబర్ నెల నుంచి ఏప్రిల్ నెల వరకు దశల వారీగా భోజ పద్ధతిలో టమాట సాగు చేస్తున్నట్లు చెప్పాడు. ఇరవై రోజుల నారుతో సాగు చేస్తే అరవై రోజుల నుంచి పంట చేతికి వస్తుందని దీంతో దశల వారీగా సాగు చేస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. కుటుంబ సభ్యులు పనులు చేసుకుంటే ఖర్చు రూ.30 వేలు పోను రూ.30 వేలు ఆదాయం వస్తుంది. టమాట బాక్స్ రూ.400 పలికితే రైతుకు నష్టం రాదని పేర్కొన్నారు.

ఆర్గానిక్ హనుమంతు..


ఆకుకూరలను పండించిన రైతు హనుమంతు, పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల పరిధిలోని అంగడిపేట గ్రామానికి చెందిన హనుమంతు అనే రైతు కూరగాయలు సాగుపై ఆసక్తి చూపిస్తున్నాడు. కాలాన్ని బట్టి రకరకాల కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నాడు. స్వల్ప కాలంలో తక్కువ పెట్టుబడితో ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా ఆర్గానిక్ పద్ధతిని ఎంచుకున్నాడు. రెండున్నరేళ్ల నుంచి రెండున్నర ఎకరాల్లో ఆకుకూరలు, కూరగాయలు టమాట, బెండకాయ, బీరకాయ పంటలను సాగు చేస్తున్నాడు ప్రతీ వారం సంతలో అమ్ముకుంటూ మంచి లాభాలను పొందుతున్నాడు.


ఏడాది పొడవునా సాగు..


కూరగాయల సాగులో రైతు ఇస్మాయిల్

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన రైతు ఇస్మాయిల్ కూరగాయల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. సీజన్‌ను బట్టి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. 8 సంవత్సరాలుగా వాణిజ్య పంటలు పత్తి, చెరకు వంటి వాటికి దూరంగా ఉంటూ మూడు ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల సాగులో రాణిస్తున్నారు. టమాట, వంకాయ, బీరకాయ, బెండకాయ, పాలకూర, మెంతి కూర, కొత్తిమీరతోపాటు వివిధ రకాల వాటిని సాగు చేస్తున్నారు. సాగు చేయడమే కాకుండా మార్కెట్‌కు తరలించకుండా పొలం పక్కనే చిన్న షెడ్డును ఏర్పాటు చేసుకొని అమ్ముతున్నారు.

ఘాటెక్కిస్తున్న గంగాపూర్..

- ఊరంతా మిర్చి సాగే



చిన్నకోడూరు(సిద్దిపేట): మిర్చి పంట ఇక్కడి రైతులకు బాసటగా నిలవడంతోపాటు మంచి ఉపాధి కల్పిస్తుంది. చిన్నకోడూరు మండలం గంగాపూర్ మిర్చి సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. గ్రామంలో సుమారు 300 మంది రైతులు మిర్చి పంటనే జీవనాధారంగా మలుచుకున్నారు. గతంలో రైతులంతా వరి, మొక్కజొన్న పంటలు పండించేవారు. రాను రాను వ్యవసాయంలో వస్తున్న మార్పులను గమనించిన రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. పదేళ్లుగా మిర్చి పంటను సాగు చేస్తున్నారు. గ్రామంలోనే గ్రామంలో మిర్చి మార్కెట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న కొద్దిపాటి నీటితో స్ప్రింక్లర్, నీటి గుంతలు, ఫాం పాండ్‌ల పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

మిర్చి పంటపైనే ఆధారం..



పదేళ్లుగా ఉన్న కొద్దిపాటి నీటితో మిర్చి పంట సాగు చేస్తున్నాం. రెండు ఎకరాల భూమిలో మిర్చి పంట సాగు చేస్తా. పెట్టుబడులు పోనూ మంచి లాభం వస్తుంది. 20 రోజులకు ఒక క్రాప్ వస్తుంది. ఇక్కడ మార్కెట్ పెట్టడంతో రవాణా భారం తగ్గింది.

–ఐరేని వెంకట్ రెడ్డి, రైతు

అవగాహన కల్పిస్తున్నాం



తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు పొందే పంటలు సాగు చేయాలి. మిర్చి సాగులో గంగాపూర్ రైతులు జిల్లాకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మిర్చి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వరి, మొక్క జొన్న పంటలతోపాటు కూరగాయల పంటలు సాగు చేయాలి.

–భాస్కర్ రెడ్డి, ఉద్యాన శాఖ డివిజన్ అధికారి

అంతర్ జిల్లాల బైక్‌ల దొంగ అరెస్టు

- రూ.40 లక్షల విలువ చేసే 19 బైక్‌లు స్వాధీనం
- నిందితుడిని రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన సీపీ అనురాధ


సిద్దిపేట కమాన్ : మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఖరీదైన బైక్‌లను దొంగతనం చేసి ఆన్‌లైన్‌లో అమ్ముతున్న అంతర్ జిల్లాల బైక్‌ల దొంగను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. కేసు, నిందితుడి వివరాలను సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధుతో కలిసి సీపీ అనురాధ వెల్లడించారు. పట్టణానికి చెందిన రవికుమార్ తన ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని మార్చి 26న గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, ఎస్ఐ నర్సింహారావు సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన కుమ్మరి సాయికుమార్ (26) బైక్‌పై వెళ్తూ అనుమానస్పదంగా పట్టుబడ్డాడు. బైక్‌కు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు విచారించారు. సాయికుమార్ సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. 2022 జూలై నుంచి ఇప్పటి వరకు నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, మెదక్, సూర్యాపేట, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట జిల్లాల పరిధిలో 19 ఖరీదైన బైక్‌లు దొంగతనం చేస్తూ తనకు తెలిసిన వారి ఇళ్లలో, స్నేహితుల వద్ద భద్రపరుస్తున్నాడు. ఆ బైక్‌లను ఆన్‌లైన్‌లో పెట్టి అమ్మకానికి పెడుతున్నాడు. నిందితుడి చెప్పిన వివరాల మేరకు 5 ప్రత్యేక టీమ్‌లతో వివిధ జిల్లాలో ఉన్న 19 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.40లక్షలు వరకు ఉంటాయని, నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. చాకచక్యంగా బైక్ దొంగను పట్టుకున్న సీఐ లక్ష్మీబాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఎస్ఐ నర్సింహారావు, సిబ్బంది కనకరాజు, భూమలింగం యాదగిరి, కానిస్టేబుల్ శ్రీకాంత్‌లను అభినందించి, త్వరలో రివార్డు అందజేస్తామని తెలిపారు.

పటాన్‌చెరులో ఇద్దరు వాహనాల దొంగలు

పటాన్‌చెరు టౌన్: వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు కతనం మేరకు.. పటాన్‌చెరు పట్టణంలోని పాత టోల్‌గేట్ సమీపంలో బుధవారం పటాన్ చెరు క్రైమ్ పోలీసులు వాహనా తనిఖీ నిర్వహిస్తున్నారు. రెండు ఆటోల్లో వచ్చిన ఇద్దరు పోలీసులను చూసి పారిపోతుండగా సయ్యద్ ఇమ్రాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్, రుద్రారం గ్రామాల్లో రాజేంద్రనగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్, చింతల్‌కు చెందిన కుమార్ ఇద్దరూ కలిసి ఆటోల దొంగతనానికి పాల్పడుతున్నట్లు తేలింది. కుమార్ పరారీలో ఉన్నాడు.

స్కూటీని దొంగిలించి పారిపోతుండగా..

పటాన్ చెరు బస్టాండ్ సమీపంలో స్కూటీని దొంగలించుకొని పోతుండగా పోలీసులు పట్టుకున్నారు. పుల్కల్ మండలం కొన్నపురం గ్రామానికి చెందిన వడ్డే నర్సింలు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఓ స్కూటీని దొంగలించి దాచిపెట్టినట్లు ఒప్పుకున్నాడు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ రజాక్, ఏఎస్ఐ రాజు, హెడ్ కానిస్టేబుళ్లు మహేందర్, మొహమ్మద్ అలీ, బాలరాజు, రాజు గౌడ్‌లను అభినందించారు.

పరిశ్రమలో కార్మికుడు మృతి


పరిశ్రమ యజమానులు, పోలీసులతో మాట్లాడుతున్న నాయకులు

సంగారెడ్డి /హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం గుండ్ల మాచునూర్ గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ ఓ కార్మికుడు బుధవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా రామన్నగూడెం గ్రామానికి చెందిన గడిశాల కిరణ్ (34) కొన్నేళ్లుగా గుండ్ల మాచనూర్ గ్రామ శివారులోని ఎపిటోరియా యూనిట్ 3 పరిశ్రమలో పర్మనెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా మంగళవారం రాత్రి పరిశ్రమలో డ్యూటీకి వెళ్లి విధులు నిర్వహిస్తూనే బుధవారం తెల్లవారుజామున కుప్పకూలి పడిపోయాడు. ఉదయం మరో ఉద్యోగి వచ్చి చూసి తోటి కార్మికులకు సమాచారం ఇచ్చాడు. కార్మికులు సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కిరణ్ ప్రమాదం సంభవించే మృతి చెందాడని కుటుంబీకులు ఆరోపించారు. అతడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద పరిశ్రమ ప్రతినిధులతో డిమాండ్ చేశారు. హత్నూర ఎస్సై సుభాష్ పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడంతో రూ.40 లక్షలు పరిహారం ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. ఆందోళనలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతివేల మాణిక్, సీఐటీయూ జిల్లా యాదగిరి, కాంగ్రెస్ పార్టీ హత్నూర మండల కార్యదర్శి జగన్ యాదవ్, ఉపాధ్యక్షుడు నర్సింహా రెడ్డి, శశిధర్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు చెంచు శ్రీశైలం ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ములుగు(గజ్వేల్): చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు మండలం నర్సాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ములుగు ఏఎస్ఐ శంకర్ కథనం మేరకు.. వర్గల్ మండలం తునికీకల్సా గ్రామానికి చెందిన మరిగాల స్వరూప(47), యాదగిరి దంపతుల కుమారుడు స్వామికి ములుగు మండలం సింగన్నగూడకు చెందిన అనంగల్ల నిఖిలతో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరి మధ్య గొడవలు జరగడంతో ఏడాదిగా నిఖిల సింగన్నగూడలోని తల్లిగారింటివద్దనే ఉంటుంది. 24న ఇంట్లో ఫంక్షన్ ఉందని స్వామికి మామ కృష్ణ చెప్పడంతో తల్లి స్వరూపతో కలసి వెళ్లాడు. బంధువులు స్వరూపతో సరిగా మాట్లాడకపోవడంతో మనస్తాపానికి లోనైంది. మరుసటి రోజు నుంచి ఆమె కనిపించకపోవడంతో వెతుకుతుండగా బుధవారం ఉదయం నర్సాపూర్ చెరువులో స్వరూప శవమై తేలింది.బంధువులు తనతో మాట్లాడలేదన్న కారణంతో చెరులో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి..

దుబ్బాకరూరల్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ భీక్యానాయక్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెల్పుల మహేశ్(40) కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మూడేళ్ల కిందట పక్షవాతం రావడంతో కుడి చేతి, కుడి కాలు పడిపోయాయి. ఆస్పత్రిలో చూయించుకున్నా నయం కాలేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురవుతూ మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వెతుకుతున్న క్రమంలో గ్రామ శివారులోని పశువుల కొట్టంలో ఉరి వేసుకొని కనిపించాడు. బుధవారం మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కొడుకుతో గొడవపడి తల్లి..

కొల్చారం(నర్సాపూర్): కొడుకుతో గొడవపడి మంజీరాలో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయల వద్ద బుధవారం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా మాసాయిపేట మండలం యశోజీపేట గ్రామానికి చెందిన దండుగుల అండాలు(58) కొడుకు రవితో కలిసి రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. పని కోసం మండలంలోని పోతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి వచ్చారు. ఈ నెల 22న ఉదయం అండాలు ఇక్కడ పని దొరకం కష్టమని హైదరాబాద్ వెళ్లి పని చేసుకుందామని కొడుకు రవితో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఏడుపాయల మొదటి బ్రిడ్జి కింద మంజీరా నీటిలో శవమై కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ గజఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత


నిందితులను చూపుతున్న పోలీసులు

దుబ్బాకటౌన్: పోలీసుల వాహన తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. బుధవారం దౌల్తాబాద్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీల్లో భాగంగా తొగుట సీఐ లతీఫ్, ఎస్సై ప్రేమ్‌దీప్ దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందూప్రియాల్ క్రాస్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాయ్‌పోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దొనపల్లిరాజు, పిట్ల నవీన్, తౌర్రి దర్శన్ ద్విచక్ర వాహనం పై అనుమానంగా తిరగడం పోలీసులు గమనించారు. వెంటనే వారిని పట్టుకొని తనిఖీ చేయగా 900 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి, 3 సెల్‌ఫోన్లు, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై ప్రేమ్‌దీప్, ఏఎస్సై సాయిలు ను ఏసీపీ అభినందించారు.